కర్నూలు | నంద్యాల
వార్త
22 సెప్టెంబర్ 2025 సోమవారం పేజీలు 4

## దుర్గామాత ఉత్సవాలు వైభవంగా జరుపుకోవాలి.. : రాష్ట్ర మంత్రి టి.జి భరత్



**కర్నూల్ హాస్పిటల్ సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :** టిజివి సంస్థల తరుపున కర్నూలు నగరంలో 45 దుర్గామాత విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. విగ్రహాలకు సంబంధించిన టోకెన్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ కార్యాలయంలో విగ్రహాల మండపాల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దుర్గామాత విగ్రహాలను కర్నూల్లో ఉచితంగా అందజేస్తామని.. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. వీటి విలువ దాదాపు రూ.7 లక్షలు ఉంటుందని తెలిపారు. టిజివి సంస్థల తరుపున కర్నూల్లో తమ సేవా కార్యక్రమాలు ఎప్పటికీ ఇలాగే కొనసాగుతాయని మంత్రి టి.జి భరత్ చెప్పారు. దుర్గామాత ఉత్సవాలను ప్రజలందరూ వైభవంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## పేదలపాలిట వరం.. ముఖ్యమంత్రి సహాయనిధి

– మంత్రి బిసి జనార్ధనరెడ్డి

**నంద్యాల, సెప్టెంబరు 21,ప్రభాతవార్త ప్రతినిధి :** కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల పాలిట వరంగా మారిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి. జనార్ధనరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 64మంది లబ్దిదారులకు రూ.44,64,166, అత్యవసర వైద్యసేవల నిమిత్తం లెటర్ ఆఫ్ క్రెడిట్ క్రింద ఐదుగురు లబ్దిదారులకు రూ.లక్షలు మొత్తం రూ.69మందికి రూ. 48,64,166 ఆర్థికసాయాన్ని చెక్కురూపంలో మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమిప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి కొండంత భరోసానిస్తోందన్నారు. నిరుపేదల ఆరోగ్యసమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజల వెన్నంటి ఉంటుందన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత గౌరవ ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కుటుంబ పెద్ద అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం అప్పుల వలలో చిక్కుకోకుండ ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటుందన్నారు. చెక్కుల పంపిణీ సందర్భంగా వైద్య సహాయం అందుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్యపరిస్థితిని వారి యోగక్షేమాలను మంత్రి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందుకున్న బాధితులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మంత్రికి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.



# సృష్టి.. స్థితి.. లయ అంశాల ప్రాముఖ్యతే.. నవరాత్రులు..!

- నవరాత్రులు..నవవిధ శక్తి స్వరూపాలు..
- తొమ్మిది రూపాల్లో అమ్మవారి దర్శనం..
- లోక కళ్యాణం కోసం అమ్మవారు ఒక్కోరోజు ఒక్కొ రూపం..
- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం..



"తెలుగు వారు దసరాను.. పది రోజుల జరుపుకుంటారు.. ముందు నవరాత్రులు దుర్గపూజ ఉంటుంది.. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసుడితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భంగా పదవ రోజు ప్రజలంతా సంతోషంతో విజయ దశమి జరుపుకుంటారు..ముఖ్యంగా దేవీ పూజా ప్రాధాన్యత ఈశాన్య భారతదేశంలో ఎక్కువ ఉంటుంది.. సోమవారం నుండి దేవి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి..

**కోసిగి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :**

**నవరాత్రులు ప్రాధాన్యత:**
నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తోంది.. నవరాత్రులను నవ అహోరాత్రులు అని ధార్మిక గ్రంథాలు చెబుతున్నాయి.. తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యేక విధానం ఉంది.. అశ్వయుజ శుక్లపక్ష పాడ్యమి తిథి నుంచి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు, తొమ్మిది పగళ్లు అమ్మవారిని పూజించడం ప్రాశస్త్యంగా చెప్పబడింది.. దీనినే శరన్నవరాత్రులు, దేవీ నవరాత్రులు అని పిలుస్తుంటారు.. నవరాత్రి వాస్తవానికి రుతువుల సంధికాలం.. అందుకనే సృష్టికి కారణమైన మహామాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది.. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించడం సులభ సాధ్యం.. తొమ్మిది రోజులు నవదుర్గలను నిష్టగా ఉపాసించే ఆరాధకులకు దేవీ అనుగ్రహం లభిస్తుందని పురాణాల్లో చెప్పబడింది.. నవరాత్రుల్లో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి.. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి దోష నివారణ జరుగుతుంది.. దేవీ అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గా సప్తశతి పారాయణం చేస్తే భక్తుల కోరికలు నెరవేరుతాయి.. నవరాత్రుల్లో మూలా నక్షత్రం ఉన్న రోజున సరస్వతీ దేవిని పూజించాలి.. అమ్మవారికి నైవేద్యంగా తెల్లని కుడుములు సమర్పించాలి..

**నవదుర్గలు.. విశిష్టత:**
ప్రకృతి స్వరూపాలనన్నింటిని జీవుడు తన మనసులో లయం చేసి ఒకే ఒక చైతన్య పరతత్వ శక్తియందు నిలిపితే జన్మ సాఫల్యాన్ని పొందుతాడు..తనలో ఉండే ఆ చైతన్య శక్తి సర్వ జీవులయందు ఉంటుందనే సత్యాన్ని గుర్తించి, చైతన్యాద్వైత శక్తిని అర్థం చేసుకుంటేదివ్యానుభూతిని పొందుతాడు.. నవ అంటే తొమ్మిదని, లేక కొత్త అని సామాన్యార్థాలు ఉన్నాయి.. కానీ నవ అంటే ఇక్కడ పరమేశ్వరుడని, రాత్రి అంటే పరమేశ్వరీ అని నిర్ణయ సింధువు తెలుపుతోంది.. కనుక నవరాత్రి వ్రతమంటే పార్వతీ పరమేశ్వరుల, శివశక్తుల, ప్రకృతీ పురుషుల ఆరాధన లేక వ్రతం, పూజా అని అర్థం.. నవరాత్రి వ్రతమంటే తొమ్మిది రాత్రులు చేయ వ్రతమని చెబుతారు.. పరమాత్మ నవ స్వరూపుడు.. శబ్దరూపమైన వేదం ప్రకృష్టమైన నవ్య స్వరూపం.. అదే ప్రణవ స్వరూపం.. నవో నవో భవతి జాయ మాన: పరమాత్మ నిత్య నూతనుడు.. అందరి చేత స్తోత్రింపబడుచున్న వాడు..శివ శక్తులకు బేధం లేదు.. అందుకే జగన్మాతకు శివాఅనే నామం కూడాఉంది.. అదే శివకామిని.. జగజ్జనని రాత్రి రూపిణి.. పరమేశ్వరుడు పగలు, జగన్మాత ఆరాధనే రాత్రి వ్రతం.. రాత్రి దేవియే మహాకాళి.. మహాలక్ష్మి, మహా సరస్వతి వంటి రూప నామాలతో పూజింపబడుతోంది.. అందుకే మాతకు కాళరాత్రి అని పేరు.. నవ అహో రాత్రి దీక్షగా రాత్రి, పగలు తొమ్మిది రోజుల చేస్తారు.. రాత్రి శబ్దస్య తిథి వాచకత్వాత్ అనే దాన్ని బట్టి రాత్రి అనగా తిథి అని అర్థం తీసుకొని తొమ్మిది తిథులు అనగా పాడ్యమి మొదలు నవమి వరకు శ్రీదేవికి పూజలు చేస్తారు..

• వివరాలు 2లో

## ఉల్లి బస్తా రూ. 100 లు, కొనుగోలు ఆశాజనకంగా..



**కర్నూలు అర్బన్, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :** మార్కెట్ యార్డ్ నందు మార్క్ఫెడ్ వారు కొనుగోలు చేసిన ఉల్లిగడ్డల సంచులను ఎటువంటి తొక్కిసలాట జరగకుండా ఉల్లి బస్తా (సుమారు 45 కిలోలు) 100 రూపాయలకు అమ్మేందుకు 4 కౌంటర్ లను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు.ఈ సందర్భంగా విక్రయాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డ్ లో 1900 టన్నుల స్టాక్ ఉందన్నారు.. ఇప్పటివరకు 130 బస్తాలను అమ్మడం కూడా జరిగిందన్నారు. ప్రజల రద్దీని కంట్రోల్ చేసేందుకు పోలీస్ బందోబస్తును కూడా ఏర్పాటు చేశామని, శానిటేషన్ సరిగ్గా లేనందున శానిటేషన్ చేయించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి, ఆర్డిఓ కర్నూలు, కల్లూరు ఎమ్.ఆర్.వో. లు 4వ పోలీస్ స్టేషన్ సీఐ,తాలూకా సీఐ, మరియు పోలీసులు, మార్కెట్ యార్డ్, మార్క్ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు..



## సరదా(దసరా) సెలవులు పెంచారోచ్..!

– 9 రోజుల నుండి 12 రోజులకు పెరిగిన సెలవులు..
– నేటి నుంచి అక్టోబరు 2 వరకు దసరా సెలవులు..

ప్రభుత్వ పాఠశాలలకు దసరా పండుగ సందర్భంగా విద్యాశాఖాధికారులు సెలవులను ప్రకటించారు.. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల కోరిక మేరకు ప్రభుత్వం పాఠశాలలకు దసరా సెలవులను మరో మూడు రోజులు పెంచింది.. ముందుగా ఈ నెల 27 నుండి అక్టోబరు 2 వరకు సెలవులు ప్రకటించింది.. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల నుండి వచ్చిన విజ్ఞాపనల మేరకు నిర్ణయాన్ని మార్పు చేసింది.. ఈ మేరకు ఈ నెల 22వ తేది నుండి అక్టోబరు 2వ తేది వరకు పన్నెండు రోజుల పాటు దసరా సెలవులు కొనసాగుతాయని విద్యాధికారులు స్పష్టం చేసారు.. దీంతో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తూ అన్ని జిల్లాల ఈఈవోలు ఉత్తర్వులు జారీ చేసారు..



**కోసిగి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :**

**సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు: డీఈవో..**
అన్ని యాజమాన్యలు, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, మునిసిపల్ అన్ని పాఠశాలలకు ఈ నెల 22వ తేదీ నుండి అక్టోబరు 2వ తేది వరకు దసరా సెలవులను ప్రకటించినట్లు జిల్లా విద్యాధికారి సామేల్‌పాల్ ప్రకటనలో తెలిపారు.. ఈ నిబంధనలను అన్ని యాజమాన్యఆల పాఠశాలలు కచ్చితంగా పాటించాలన్నారు.. ఎట్టి పరిస్థితుల్లోనూ దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, ఈ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను దసరా సెలవుల్లో పాఠశాలలకు పంపించరాదని, ఏ పాఠశాలలో పిల్లలను తమ పాఠశాలకు పంపించాలని బలవంతం చేస్తే దసరా సెలవుల విషయాన్ని గుర్తు చేయాలని కోరారు..దసరా సెలవుల్లో తెలియకుండా ఎవరైనా పాఠశాల నిర్వహించినా, లేక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పాఠశాల వారే బాధ్యులు అవుతారనే విషయాన్ని అన్ని డివిజనల్ విద్యాధికారులకు, మండల విద్యాశాఖ అధికారులు గుర్తెరిగి తమ పరిధిలోని పాఠశాలలకు తగు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు..సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్దనే ఉంటూ తమకు క్లాస్ టీచర్లు ఇచ్చిన హోమ్‌వర్కును సక్రమంగా చేసుకుని పాఠశాలలు తెరిచిన తరువాత ఉపాధ్యాయులకు చూపించాల్సి ఉంటుందని తెలియజేస్తున్నారు. ఏది ఏమైన దసరా పండుగ వచ్చిందంటే పిల్లల్లో ఉరుకులు, ఉత్సాహాలు కనిపిస్తాయి.. ఇంటింటికి తిరిగి పోలి చల్లుతారు.. అయ్యవారికి చాలు అయిదు వరహాలు అంటూ పూర్వకాలం పాట పాడుతారు..కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయుల పాదాలకు నమస్కారించడంతో పాటు పెద్దల చేతులలో జమ్మిపత్రి పెట్టి పాదాలకు నమస్కారం చేసి వారి ఆశీర్వాదాలను తీసుకుంటారు.. అంతేకాక మరి కొన్ని ప్రాంతాల్లో ఒకరిపై ఒకరు రంగులను చల్లుకుని దసరాను సరదాగా చేసుకుంటారు..

# జలమయమైన లోతట్టు ప్రాంతాలు, ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరువాగు









**నంద్యాల, సెప్టెంబరు 21, ప్రభాతవార్త ప్రతినిధి**
బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల శనివారం రాత్రి మహానందిలో కుండపోత వర్షం కురిసింది. దీని ప్రభావంతో ఆచార్య ఎన్‌జిరంగా అగ్రికల్చర్ కళాశాల చుట్టూ ఉన్న అటవీప్రాంతం నుంచి భారీగా నంద్యాలకు వరదనీరు చేరింది. దీంతో నంద్యాల రామక్రిష్ణారెడ్డి పిజి కళాశాల వద్ద పాలేరు వాగు వంతెన పైభాగం నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో నంద్యాల పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీ, ఎన్‌జిఓ కాలనీని వరదనీరు చుట్టూ ముట్టింది. పాలేరు ఉధృతికి శ్యామ కాలువ కుందూనదిని తలపించింది. శ్యామకాలువ ఉధృతంగా ప్రవహించడంతో శ్యాంనగర్, పరిసరాల్లో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరుకుంది. దీంతో ఇళ్లలోకి నీరు చేరుకోవడంతో ఆయా కాలనీవాసులు భయాందోళనతో పరుగులు పెట్టారు. వరదనీరు ఇళ్లలోకి చేరడంతో నిత్యావసర వస్తువులన్నీ శ్యామకాలువ వెంట కుందూనదిలోకి చేరాయి. అలాగే శ్యామకాలువ ఆనుకుని ఉన్న ప్రథమనంది దేవాలయంలోనికి నీరు చేరుకోవడంతో రాకపోకలు స్థంభించి జనజీవనం స్థంభించింది. వరదనీటి బాధితులను కాపాడేందుకు మంత్రి ఫరూక్ కుమారుడు ఫిరోజ్ తహశీల్దారు శ్రీనివాసులు, సహాయక చర్యలు చేపట్టారు.

## బ్రహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రహ్మణులకు సహాయ సహకారాలు





**కర్నూలు విద్య, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** ఏపీ బ్రహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా ఏస్‌కే శ్రీనివాస్ నియమించబడిన సందర్భంగా కర్నూలు నగర బ్రహ్మణ సంఘం ఆద్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో సన్మాన గ్రహీత ఎస్కే శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, యువ నాయకులు నారా లోకేష్‌కు, ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డికి గౌరు వెంకటరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏపీ బ్రహ్మణ కార్పొరేషన్ ద్వారా పేద బ్రహ్మణులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న నిత్యం అందుబాటులో ఉండి వారికి కావాల్సిన సహాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గాయత్రి బ్రహ్మణ సంఘం నాయకులు కొలుకుల చంద్రశేఖర్, పిఎన్ రాజేశ్వర్‌రావులు పాల్గొన్నారు.



## దొంగల బీభత్సం.. ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ..!



**ఎమ్మిగనూరు. సెప్టెంబర్ 21ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించిన్న సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. పట్టణంలోని వివర్స్ కాలనీలో మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనలో, దొంగలు ఒక ఇంటికి వేసిన తాళం పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. మరోక్క ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి, అందులో ఉన్న రూ. 24,000,ఒక తులం బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ప్రధాన దొంగతనాలు చేసే ముందు, పక్కన ఉన్న మూడు ఇళ్లలోని వారు బయటకు రాకుండా, ఇంటి బయట గడియలు వేశారని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై బాధితులు వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనలతో వివర్స్ కాలనీ వాసుల్లో భయం నెలకొంది.

## శ్రీ రాఘవేంద్రస్వామి వారి సన్నిధిలో టీడీపీ జిల్లా అధ్యక్షులు

– జిల్లా అధ్యక్షుడికి ప్రసాదం అందజేసి ఆశీర్వదించిన మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు స్వామి

**మంత్రాలయం, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పూజారులు ప్రత్యేక స్వాగతం పలికారు. పాలకుర్తి తిక్కారెడ్డి ముందుగా శ్రీ మంచాలమ్మదేవిని దర్శించుని, శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు స్వామి శాలువా, పూలమాలతో సన్మానించి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పన్నాగ వెంకటేశప్పస్వామి, కోసిగి మండల నాయకుడు భరద్వాజ్శెట్టి, మాధవరం కృష్ణమోహన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, విజయరామిరెడ్డి, చిన్నతుంబలం సిద్ధప్ప ధని, చిన్నకడబూరు దశరథరాముడు, దొడ్డి బెళగల్ ప్రభాకర్‌రెడ్డి, దొడ్డి బెళగల్ గ్రామ సర్పంచ్ రాము, రాజారెడ్డి, కమలదిన్నె శ్రీనివాసులు, వగరూరు అబ్దుల్లా, మంత్రాలయం మండలం తెలుగు యువత అధ్యక్షులు సాయినాథ్‌రెడ్డి, భీమన్న ఆచారి, వట్టేప్పగారి నరసింహులు, ఐ టీడీపీ సభ్యులు బసలదొడ్డి కృష్ణ, దిద్ది నగేష్, మాధవరం అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



# ఊపిరితిత్తుల సమస్యలపై వైద్యులకు వినూత్న జ్ఞాన వేదిక



**కర్నూలు, హాస్పిటల్ సెప్టెంబర్ 21: ప్రభాతవార్త:** యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ ఆధ్వర్యంలో ఊపిరితిత్తుల వ్యాధులపై వైద్యులకు వినూత్న జ్ఞాన వేదికను ఏర్పాటు చేసినట్లు సి ఎం ఈ నాగార్జున మాతూరు యశోద హాస్పిటల్ తెలియజేశారు ఊపిరితిత్తుల వ్యాధులు భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, వైద్యులకు వినూత్న జ్ఞానాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో "ప్రాంతీయ పల్మో నవీకరణ 2025"ను కర్నూలులో ప్రత్యేకంగా నిర్వహించారు. సాధారణంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సదస్సులు పెద్ద నగరాల్లో మాత్రమే జరుగుతాయన్న ఆలోచనను తొలగిస్తూ, దక్షిణ ఆంధ్రప్రదేశ్ కల్చరల్ హబ్‌గా పేరుగాంచిన కర్నూలును ఈ సదస్సు ఆతిథ్య వేదికగా ఎంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పల్మనరీ మరియు క్రిటికల్ కేర్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించగా, హైదరాబాద్‌తో పాటు భారతదేశంలోని పలువురు ప్రసిద్ధ నిపుణులు పాల్గొని తాజా సమాచారం, కొత్త సాంకేతికతలను స్థానిక వైద్యులకు చేరువ చేశారు. "ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు కొత్త మందులు, సాంకేతికతలపై అవగాహన కలిగి ఉండటం అవసరం. రోగులకు మెరుగైన చికిత్స అందించడమే మా లక్ష్యం" అని సి ఎం ఈ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ వి. నాగార్జున మాతూరు తెలిపారు. అతని నేతృత్వంలోని హైదరాబాదులోని యశోద హాస్పిటల్స్ విభాగం భారతదేశంలో తొలి నావిగేషనల్ బ్రోంకోస్కోపీ, బయోడిగ్రేడబుల్ స్టెంట్లు, ఊపిరితిత్తుల నోడ్యూల్ క్లినిక్ లాంటి పలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు నాంది పలికింది. తాజాగా కృత్రిమ మేధస్సు సహకార వేదికలు ఏ ఐ మరియు ల్యాంబియో ను ఉపయోగించి వైద్యులకు సముచిత నిర్ణయాలు తీసుకోవడంలో సాయం చేస్తోంది. డాక్టర్ వెంకట్ రమణ కోలా ఆధ్వర్యంలోని క్రిటికల్ కేర్ విభాగం 200 పడకల ఆధునిక ఐసీయూతో ఈ ప్రాంతంలోనే అతిపెద్ద కేంద్రంగా నిలుస్తోంది. అత్యాధునిక వెంటిలేషన్ వ్యవస్థలు, ఎక్మో సౌకర్యాలు, ఎయిర్ అంబులెన్స్ సేవలతో అనారోగ్య రోగుల సహాయార్థం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఈ ప్రాంతంలోని పలువురు ప్రముఖ పల్మ నాలజిస్టులు డాక్టర్ కుల్లాయప్ప, డాక్టర్ ఎం. శైలజ, డాక్టర్ సి. శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ జి. సుబ్బారావు, డాక్టర్ నెమలి రవి కుమార్ రెడ్డి, డాక్టర్ సుధీంద్ర, డాక్టర్ గంగాధర్ రెడ్డి తో పాటు ఇంటెన్సివిస్టులు, వైద్యులు పాల్గొన్నారు. ఉదయం ప్రత్యక్ష కేసుల ఆధారంగా చర్చలు, క్విజ్‌లు నిర్వహించి, మధ్యాహ్నం ప్రత్యేక అనుభవంగా మానెక్విన్లపై ప్రాక్టికల్ ప్రదర్శనలు చేశారు. 300 మందికి పైగా పాల్గొన్న ఈ "ప్రాంతీయ పల్మో నవీకరణ2025" సదస్సు తన ప్రధాన లక్ష్యమైన "జ్ఞాన వ్యాప్తి"ని విజయవంతంగా సాధించి, వైద్య సమాజంలో విశేష స్పందనను రాబట్టింది.

# నిరుద్యోగ యువత జాబ్‌మేళను సద్వినియోగం చేసుకోండి

**: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళ**



**ఆత్మకూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణంలో సెప్టెంబర్ 29న జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు డిఎస్‌డిఓ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వేల్పనూరు గ్రామంలో శ్రీశైలం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డితో జాబ్‌మేళ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 ప్రవేట్ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పాల్గొంటారని పదవతరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బిటెక్, పీజి పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీటికి సంబందించిన వివరాల కొరకు 7673902328, 9154830286, నైపుణ్యం. ఎపి.జిఓవి.ఇన్ సంప్రదించాలని తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షులు జెట్టి.వేణుగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దులాపురం బాష, విఆర్‌ఎస్పీ ప్రాజెక్టు చైర్మన్ పోచ మల్లికార్జునరెడ్డి, సుబ్బన్న, పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎంఎల్ఏ బుడ్డాకు శరణ్యనవరాత్రులకు ఆహ్వానం



**ఆత్మకూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** విజయదశమి పండుగను పురస్కరించుకునేందుకు భక్తాదులు 9రోజుల పాటు శరణ్య నవరాత్రుల బ్రహ్మోత్సవాలను నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిధులుగా శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డిని ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యాక్షులు కొప్పరపు రవిప్రసాద్, వర్కింగ్ అధ్యక్షులు నరహరి బాలయ్య, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శేగు కిరణ్‌కుమార్, కిరాణం అసోసియేషన్ మర్చంట్ అధ్యక్షులు శేగు వేణుగోపాల్, ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు నాగరాజులు ఆదివారం ఎంఎల్ఏ నివాసంలో మర్యాద పూర్వకంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ నేటి నుంచి పట్టణంలో కన్యకపరమేశ్వరి అమ్మవారిశాలలో జరిగే బ్రహోత్సవాలకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. సంప్రదాయ పండుగలను అన్ని సామాజిక వర్గాల ప్రజలు కలసికట్టుగా చేసుకోవాలని అన్నారు. శరణ్య నవరాత్రుల బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ అలంకరణలు భక్తులకు అమ్మవారు ప్రత్యేక దర్శనం ఇస్తున్నారని వివరించారు. ముఖ్య అతిధులుగా శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ హాజరవుతున్నట్లు వివరించారు. వీరివెంటా ఆర్యవైశ్య నాయకులు సత్యం, బివి.శేషపాణి, ఈపూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సృష్టి.. స్థితి.. లయ అంశాల ప్రాముఖ్యతే.. నవరాత్రులు..!

**(మొదటి పేజీ తరువాయి ) :** పాడ్యమి అంటే బుద్ధి అని చెప్పబడింది.. మనుష్యుల బుద్ధియే శారదాదేవి, పాడ్యమి నుండి శారదాదేవిని ఆరాధిస్తే మంచి బుద్దిని సాదిస్తుంది.. సర్వ శుభములను చేకూర్చుతుంది.. మనలో ఉన్న ఉత్సాహాన్ని పైకి వ్యక్తీకరించటమే ఉత్సవం అంటారు.. ఇది పెద్ద ఉత్సవం మహోత్సవం.. ఇది దేవీ శరన్నవరాత్రి పూజా మహోత్సవాల అంతరార్థం....

**నవదుర్గలు:-**

హిందూ సంప్రదాయంలో శక్తి స్వరూపిణి అయిన పార్వతి అవతారాలలో నవదుర్గలు ముఖ్యమైనవిగా భావిస్తారు.. ఆ తల్లి బ్రహ్మ, విష్ణు, శివ అంశాలతో మహా సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళిగా అవతరించినదని, ప్రతి అవతారం నుండి మరొక రెండు రూపాలు వెలువడినాయని కథనం.. ఇలా మూడు, ఆరు, తొమ్మిది స్వరూపిణులుగా, అనగా నవ దుర్గలుగా, దుర్గను పూజిస్తారు..సప్తశతీ మహా మంత్రానికి అంగభూతమైన దేవీ కవచంలో నవదుర్గలు అనే పదం స్పష్టంగా కనిపిస్తోంది.. ఈ దేవీ కవచంలో ఇలా ఉంది.. "ప్రథమం శైల పుత్రీతి.. ద్వితీయం బ్రహ్మచారిణీ.. తృతీయం చంద్రఘంటేతి.. చతుర్థకం కూష్మాండేతి.. పంచమం స్కందమాతేతి.. షష్టం కాత్యాయనీతి చ.. సప్తమం కాలరాత్రీత.. అష్టమం మహాగౌరీతి చా.. నవమం సిద్ధిదాత్రి ప్రోక్తా.. నవదుర్గా ప్రకీర్తితా ఇక్తాన్యేతాని నామాని బ్రహ్మణైన మహాత్మనా".. ఈ తొమ్మిది నామాలను సాక్షాత్తు బ్రహ్మదేవుడే చెప్పాడని ఉంది.. మహా శక్తిస్వరూపిణి అయిన దుర్గా మాతను మనం అనేక రూపాల్లో కొలుచుకుంటాం..అయితే వాటిలో ముఖ్యమైనవి తొమ్మిది అవతారాలు.. వారినే మనం నవదుర్గలని అంటుంటాం..దుర్గామాత ముఖ్యమైన అవతారాలు మూడు.. మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి.. వీరు శ్రీమహావిష్ణువు, పరబ్రహ్మ, పరమశివుని అర్థాంగినులుగా మనకు కనిపిస్తారు.. వీరిలో ఒక్కొక్కరూ తిరిగి మూడు అవతారాలు పొందారు.. ఆ విధంగా నవదుర్గలుగా ప్రసిద్ధి చెందారు..

# ఆదోని జిల్లా సాధనకై ఏకతాటిపై ఉద్యమం చేద్దాం

**: కర్నూలు జిల్లాకు దామోదర సంజీవయ్య పేరు పెట్టాల్సిందే**



**ఆదోని, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** అత్యంత వెనుకబడిన ఆదోని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి కర్నూలు జిల్లాకు దామోదర్ సంజీవయ్య పేరు పెట్టాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదరం రాధాకృష్ణ మూర్తి, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ , ఆదినారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, మానవ హక్కుల వేదిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యూజీ శ్రీనివాసులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ దేవిశెట్టి ప్రకాష్ సిపిఐ అనుబంధ సంఘం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ అభ్యుదయ దళిత సేవా సంఘం కార్యదర్శి కల్లుపోతుల రంగన్న తోపాటు కుల , విద్యార్థి, ప్రజా,సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదోని జిల్లా సాధనకై ఆదివారం పట్టణంలోని రెవిన్యూ భవన్లో ఆదోని జిల్లా సాధన సమితి కన్వీనర్ కళ్ళు పోతుల రంగన్న , అభ్యుదయ దళిత సేవా సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి అంబేద్కర్ నగర్ కుంకునూరు వీరేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గం పూర్తిగా వర్షాధార ప్రాంతం కావడంతో పంటలు సరిగా పండక రైతులు ప్రతి ఏటా అప్పుల పాలవుతున్నారన్నారు. ఆదోనిలో ఉన్న పరిశ్రమలన్నీ మూతపడడంతో ఉపాధి కోసం మహా నగరాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని అభివృద్ధి చెందాలన్నా ఉపాధి అవకాశాలు రావాలన్నా జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమని ఇందుకోసం పార్టీలకతీతంగా కుల సంఘాలు విద్యార్థి యువజన సంఘాలతో పాటు ప్రజలు ఏకతాటిపై వచ్చి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లక్ష 30 వేల జనాభా కలిగిన ఆదోని నియోజకవర్గంని నాలుగు మండలాల విభజించాలని అప్పుడే పరిపాలన సౌలభ్యం మరింత సులభంగా ఉంటుందన్నారు. ఇప్పటికే పెద్ద హరివాణం ప్రజలు పార్టీల నాయకులు తమకు పెద్ద హరివానమును మండలముగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారని ఆదోని జిల్లా ఏర్పాటు అయితే మండలాలు కూడా ఏర్పాటు అవుతాయని అందుకోసం ఐక్య ఉద్యమాలు ద్వారా సాధించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. జిల్లా సాధన కోసం జేఏసీగా ఏర్పాటు చేసి వారు చేపట్టి ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని రాహుల్ సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీ నాయకులు ప్రజా సంఘాలు విద్యార్థి యువజన సంఘాలు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు తెలిపారు ఈ సమావేశంలో ఆలూరు ఎమ్మిగనూరు పత్తికొండ ఆదోని మంత్రాలయం నియోజకవర్గాల నుండి ఆయా పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లింగానిర్ధారణకు పాల్పడిన ప్రైవేట్ ఆసుపత్రి సీజ్

**- ఎ.పి,కర్ణాటక రాష్ట్రాల డిఎంహెచ్‌వోల ఆకస్మిక దాడి**

**కోడుమూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :**



కోడుమూరు పట్టణంలో ఒక ప్రైవేట్ వైద్యశాలల్లో లింగనిర్ధారణ చేస్తున్న విషయం వెలుగులోకి రావడంతో ఆదివారం కర్నూలు డిఎంహెచ్‌వో పి.శాంతికల,ఏ.పి నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనీల్‌కుమార్,కర్ణాటక రాష్ట్రంకు చెందిన పి.సిపిఎన్‌డిటి నోడల్ ఆఫీసర్ డాక్టర్ వివేక్‌దొరై ఆధ్వర్యంలో దాడులు చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి ఇక్కడి వైద్యశాలకు కొంత మంది గర్భవతులు వచ్చి లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకున్న విషయం వెలుగుచూసింది. దీంతో గర్భంలో ఆడమగ గుర్తించారని నిర్ధారించి డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా అక్కడి ప్రభుత్వ వైద్యాధికారులు సూచిస్తూ ఆ మేరకు ఇలాంటి చట్టవ్యతిరేక పనులకు పూనుకున్న వాటిపై దాడులు చేసేందుకు కర్నూలు జిల్లా వైద్యాధికారుల బృందంతో కలిసి దాడులకు దిగారు. ఈ దాడులో ఆసుపత్రిలో అనుమతుల్లేకుండా స్కానింగ్ సేవలను అందిస్తున్న విషయాన్ని గుర్తించారు. ఆ తరువాత వైద్యాధికారులు ఆసుపత్రిని సీజ్ చేశారు. ఈ దాడుల్లో రెండు రాష్ట్రాల వైద్యాధికారుల బృందం పిసిపిఎన్‌డిటి నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్,స్థానిక ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రఘురామిరెడ్డి,డిఇఎంవో శ్రీనివాసులు,పిసిపిఎన్‌డిటి కన్సల్టెంట్ సుమలత,కర్ణాటక వైద్యులు అనీల్,థామస్,లీగల్ కన్సల్టెంట్ మోనీసాలు పాల్గొన్నారు.

# గురజాడ సాహిత్య పురస్కారం ప్రకటించాల్కి

**ఆదోనిలీగల్, సెప్టెంబరు21, ప్రభాతవార్త;**



తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి ప్రభుత్వం గురజాడ అప్పారావు సాహిత్య పురస్కారం అందించాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప డిమాండ్ చేశారు. ఆదివారం గురజాడ జయంతి కార్యక్రమ్నాన స్థానిక నైస్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో సాహితీ స్రవంతి డివిజన్ అధ్యక్షులు సక్కిరి భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ ప్రేమికులు అభ్యుదయ కవి గురజాడ వారి దేశాన్ని ప్రేమించుమన్నా దేశ భక్తి గేయం ప్రతిరోజూ పాఠశాల ప్రార్థనలో విద్యార్థులచే పాడించి, విద్యార్థుల్లో దేశభక్తిని కలిగించాలని ప్రభుత్వానికి సూచించారు. విజయనగరంలోని గురజాడ ఇంటిని ప్రభుత్వం తెలుగు సాహితీ స్మారక భవనంగా తీర్చిదిద్దాలని, ప్రస్తుతం గురజాడ ఇంటిలో పందులు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గురజాడ ముందుచూపు కలిగిన దార్శనికుడని, అతని కవిత్వాన్ని పాఠ్య పుస్తకాల ద్వారా సమాజానికి అందించాలని డిమాండ్ చేశారు. భాస్కర్, అమల నాథన్, ఓంకార్, షేక్షావలి,, నల్లారెడ్డి, ప్రేమ్‌కుమార్, నరసప్ప, సుబ్బన్నలు పాల్గొన్నారు.

# 168 హెక్టార్‌లలో పంట నష్టం

**ఉయ్యలవాడ, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:**



ఉయ్యలవాడ మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం మొత్తం 168 హెక్టార్‌లలో పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 93 హెక్టార్‌లలో వరి, 27హెక్టార్‌లలో కంది, 43 హెక్టార్ లలో మొక్కజొన్న, ఐదు హెక్టార్‌లలో పత్తిపంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. మండలం మొత్తం మీదుగా ఫీల్డ్ స్థాయిలో పంటలను పరిశీలించి తుది జాబితాను ప్రకటిస్తామన్నారు.

# అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపిటిసి వీరయ్య

**- అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సర్పంచుల మధ్య వాగ్వివాదం - ప్రజాప్రతినిధుల సమస్యలు పరిష్కరించడం లేదు - ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారు**

**ఉయ్యలవాడ, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని హరివరం గ్రామంలో గతు ఐదు సంవత్సరాలుగా ఉన్న తన సమస్యను పరిష్కరించలేదని అలాంటి ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని హరివరం గ్రామ ఎంపిటిసి పెద్ద వీరయ్య, హౌసింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం ఉయ్యలవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అన్నిశాఖల అధికారులు వారి వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అయితే హరివరం గ్రామ ఎంపిటిసి వీరయ్య తనభార్య పేరుమీద ఇంటినిర్మాణం ధరఖాస్తులుచేసుకోవడానికి పోతే తనభార్య అధార్ వేరేవారికి అనుసంధానం అయినట్లు హౌసింగ్ అధికారులు చెప్పారన్నారు. ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తమ ఆఫీసుల చుట్టు తిప్పుకుంటూ ఐదు సంవత్సరాలు పూర్తి అయింది కానీ ఇంతవరకు ఆ సమస్య అలాగే ఉందనా్నరు. ప్రజా ప్రతినిధుల సమస్యలు పరిష్కరించలేని వారు ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారన్నారు.

**విద్యాబోధన సరిగా లేకనే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది:** ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన సరిగా లేక విద్యార్థులు సంఖ్య తగ్గుతుందని అల్లూరు గ్రామ సర్పంచ్ కృష్ణవేణి ధ్వజమెత్తారు. ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులు అధిక సంఖ్యలో వెళ్లడానికి ప్రధాన కారణం ఇదే అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రానికి సమయానికి చేరుకోవడం లేదన్నారు. చిన్నవయసులోనే ఇంగ్లీషుమీడియం బోధిస్తే అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆమె అన్నారు. ఈవిషయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరం, సర్పంచ్ కృష్ణవేణి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈకార్యక్రమంలో అయా శాఖల అధికారులు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# శక్తి యాప్ సేవలు సద్వినియోగం చేసుకోండి

**కర్నూల్ హాస్పిటల్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :**




శక్తి యాప్ సేవలను సద్వినియోగం చేసుకొని మహిళలు, విద్యార్థినులు ఆపత్కాలంలో రక్షణ పొందవచ్చని శక్తి టీం కర్నూలు సబ్ డివిజన్ సభ్యులు డేగ శ్రీనివాస్ యాదవ్, వై మద్దిలేటి లు అన్నారు.శ్రీ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సీఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, కళాశాలలో విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం నగర పరిధిలోని ఎన్ ఖండేరి ఏరియా నందుశ్రీ స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలనందు 6 నుంచి పదవ తరగతి విద్యార్థులు 75 మొత్తం 129 విద్యార్థినీ విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తి యాప్ ఆపత్కాలంలో మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా నిలుస్తుందని తెలిపారు. అత్యవసర సమయాల్లో వాట్సాప్ నంబర్ 7993485111 కు కాల్ చేసినా, మెసేజ్ చేసిన పోలీసులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపడుతారని అన్నారు. శక్తి యాప్ ను ప్రతి ఒక్క మహిళ, విద్యార్థినిలు డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా డయల్ 112, 181, చైల్డ్ మ్యారేజ్1098, సైబర్ క్రైమ్1930, ఎస్ ఓ ఎస్ ,బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతేకాకుండా రోడ్ సేఫ్టీ గురించి, మొబైల్ ను వాడుకునే విధానం గురించి, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ గురించి, సోషల్ మీడియా ప్రభావము, చదువుకు ఉన్న ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్ మొదలైన వాటి గురించి క్షుణ్ణంగా విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో కర్నూల్ సబ్ డివిజన్ శక్తి టీం సభ్యులు డి.శ్రీనివాస్ యాదవ్ వై, మద్దిలేటి, హెచ్‌ఎం ఆర్ , నీలవేణి మేడం మరియు టీచర్స్ , సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీలో స్వచ్ఛతహీ సేవను ప్రారంభించిన మంత్రి

**బనగానపల్లె, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాల, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి బనగానపల్లె గ్రామ పంచాయితీలో ఆదివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయితీలో పారిశుద్ధ్య వ్యర్థాల సేకరణ కొరకు రూ.8,75,698ల వ్యవయంతో కొనుగోలు చేసిన రెండు నూతన ఎలక్ట్రిక్ ఆటోలు, క్రిమికీటకాల నిర్మూలనకు రూ.3.92 లక్షలతో కొనుగోలు చేసిన రెండు ఫాగ్ మిషన్లు ప్లాస్టిక్ నిషేధంపై మరిన్ని చర్యలు చేపట్టేందుకు స్వచ్ఛరథం ప్రారంభించారు. ఈసందర్భంగా మొదటిసారిగా పారిశుద్ధ్యకార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు అందించాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి పారిశుద్ధ్యకార్మికుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పారిశుద్ధ్యకార్మికులు ఉదయం 6 గంటల నుండి వీధులు, రహదారుల పారిశుద్ధ్య పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీచేశారు. పారిశుద్ధ్య కార్మికులు గతంలో జీతాలు పెంచమని కోరితే రూ.1000లు పెంచడం జరిగింది. క్షేత్రస్థాయిలో బనగానపల్లెను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పారిశుద్ధ్యకార్మికులపై అధికారులపై ఉందని వారికి సూచించారు. ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ బనగానపల్లె సాధనలో ప్రజలందరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయితీ ఈవో బొమ్మిరెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి, ఈవోఆర్డి బాలాంజనేయులు, సర్పంచ్ ఈ ఎల్లమ్మ, టిడిపి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉల్లి రైతులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన టీడీపీ ప్రభుత్వం

**- రైతుల సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి - టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, బడిగింజల రంగన్న, మలకన్న**



**దేవనకొండ, సెప్టెంబరు 21, ప్రభాతవార్త;** ఉల్లి రైతులను ఆదుకోవడానికి, రైతుల సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, బడిగింజల రంగన్న, మలకన్న పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆదేశాల మేరకు వారు ఆదివారం దేవనకొండలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి, గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతన్నల కష్టాలను చూడలేక ఉల్లి పండించిన ప్రతిరైతుకు హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. దీంతో ప్రభుత్వంపై రూ.వంద కోట్లు భారం పడుతుందన్నారు. అలాగే రైతు శ్రేయస్సుకై ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ పథకం రూ.20 వేలు ఇస్తామని చెప్పడం జరిగిందని, దీని ద్వారా ఒక్కో రైతుకు రూ.7 వేలు అందించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రజలు మెచ్చిన నాయకుడు చంద్రబాబునాయుడు అని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ నాయకులు రాజాసాబ్, మస్తాన్, టీవీ రామంజిని, కుక్కల తిమ్మయ్య, హుసేని, హనుమంతు, గాజుల శీను, బడేసాబ్, బంగి రంగన్న, హరికృష్ణ, చంద్ర, మురళి, రైతు సంఘం నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుంతలు పడ్డ పిల్లిగుండ్ల,నెరుడుప్పల రహదారి



**గోనెగండ్ల, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** గోనెగండ్ల మండలం పరిధిలోని గాజులదిన్నె క్రాస్ రోడ్డు నుంచి పిల్లిగుండ్ల,నెరుడుప్పల,ఒంటెదుదిన్నె,గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలు పడి పోయింది.వర్షాలు కురియడంతో గుంత మరింత పెద్దవయ్యాయి,గుంతలలో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.రాత్రి పూట ద్విచక్రవాహన దారులు,ఆటోలు గుంతలలో పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి.ఇదే రహదారి వెంటనే గోనెగండ్ల నుంచి పిల్లిగుండ్ల,నెరుడుప్పల,బండగట్టు,నెల్లిబండ,కప్పట్రాళ్ల క్రాస్ రోడ్డు నుంచి పత్తికొండకు అలాగే ఎర్రబాడు మీదుగా ఈదులదేవర బండ,కోడుమూరుకు గ్రామాలకు బస్సులు, ఆటోలు వెలుతుంటాయి.కావున గుంతలు పడిన రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రహదారిని బాగుచేయాలని పలు మార్లు అధికారులు,నాయకుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు.రహదారి మొత్తం గుంతపడి పోవడంతో ద్విచక్రవాహనాలను,ఆటోల రాక పోకలకు ఇబ్బందిగా మారిందని దీనికి తోను ఈ గ్రామాల విద్యార్థులు చదువుకునేందుకు గోనెగండ్లకు రావాల్సి ఉంటడంతో సైకిళ్ల,ద్విచక్రవాహనలు ఆటోలలో వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సిద్దారెడ్డి యూత్‌స్టార్ కాదు యూట్యూబ్‌స్టార్

**- చింతా సురేష్ బాబు**

**కర్నూలు విద్య, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** వైఎస్సార్‌సీపీ నాయకులు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యాలు చేస్తే చూస్తు సహించబోమని జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు ఘాటుగా స్పందిచారు. ఈమేరకు ఆదివారం జనసేన పార్టీ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. బైరెడ్డి సిద్దారెడ్డి యూత్‌స్టార్ కాదు యూట్యూబ్ స్టార్ అని గ్రహించాలని పవన్‌కళ్యాణ్‌ను విమర్శించడం తగదని మీ నాయకునికి చిత్తశుద్ధి ఉంటే శాసన సభకు వెళ్లి ప్రజలకు ఏమి అన్యాయం జరిగిందో వాటిపై చర్చకు రావలని సవాల్ విసిరారు.

# ఉల్లిరైతులకు రూ.50వేల ప్రభుత్వ ప్రకటనపై రైతులు హర్షం

**- గుంటుపల్లిలో సిఎం,డిప్యూటీ సిఎం,పత్తికొండ ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం**



**వెల్దుర్తి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన వరా్షలకు తీవ్రంగా నష్టపోయిన ఉల్లిరైతులకు హెక్టారుకు రూ.50వేల రుపాయలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారని గుంటుపల్లి తెదేపా నాయకులు ఈదుల వెంకటరాముడు అన్నారు.గ్రామంలో ఆయన రైతులతో కలిసి ఆదివారం ఏపి సిఎం నారా చంద్రబాబునాయుడు,మాజీ డిప్యూటీ సిఎం కెఇ క్రిష్ణమూర్తి,డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్,పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు,చిత్రపటాలకు పూలామాలలు వేసి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వెంకటరాముడు మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమన్నారు.రైతులకు మేలు జరిగిందంటే అది చంద్రబాబునాయుడు సారధ్యంలోనే అన్నారు.ఈ కార్యక్రమలో శేషిరెడ్డి,జరిపిటి వెంకటేశం,మూలింటి శేషన్న,బళ్లారి రాముడు,రామాంజనేయులు,దామ నారాయణ,శివనారాయణ,గొల్లవంక రామక్రిష్ణ,సలింద్ర రాధాక్రిష్ణ,రాముడు,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులతో దేవాలయాలు, దర్గాలు





**హోళగుంద, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** ఆదివారం అమావాస్య సందర్భంగా దేవాలయాలు దర్గాలు భక్తులతో కిటకిట లాడాయి ఈ సందర్భంగా ఆదివారం దేవరగట్టు శ్రీ మాల మల్లేశ్వర స్వామి దేవాలయంలోఆదివారం అమావాస్య సందర్భంగా దేవరగట్టు మళమాల్లేశ్వర స్వామి వారికి అభిషేకం బిల్వ అర్చన బండారు అర్చన అమ్మా వారికి కుంకుమ అర్చన ఆకు పూజ తదితర విశిష్ట పూజలు చేపట్టినట్లు అర్చకులు పంప స్వామి మహేష్ స్వామి తెలిపారు దేవరగట్టు శ్రీ మాల మల్లేశ్వర స్వామి దర్శనం దర్శించేందుకు వచ్చిన భక్తాదులు చిన్నరాలు కుంకుమ బండారు అట్టిస్తూ గిరి పైకెక్కి ప్రత్యేక పూజలు చేయించి మొక్కుబడును చెల్లించుకున్నారు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీలు తరపున అన్నదాన్నం ఏర్పాటు చేశారు అలాగే ఎల్లార్తి శేక్షవలి షాషావలి దర్గాలలో అమావాస్య ఆదివారం సందర్భంగా దర్గాలలో భక్తాదులు ప్రత్యేక ఫాతిహాలు చేయించుకుని తమ మొక్కుబడులను చెల్లించుకున్నట్లు దర్గా నిర్వాహకుడు షాపిర్ ఖాన్ తెలిపారు వచ్చిన భక్తాదులకు అన్నదానం కార్యక్రమం చేసినట్లు వారు తెలిపారు.

# ఉల్లి, టమోటా, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి..

**కర్నూలు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త ప్రతినిధి :** ఏపీ రైతు సంఘం ప్రతినిధి బృందం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి0 దంభోళం(శ్రీనివాసరావు మరియు వారి బృందం జిల్లావ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటల పరిశీలనలో భాగంగా కల్లూరు మండలంలో వివిధ గ్రామాలు తిరుగుతూ పెద్దటేకూరు లో ఉల్లి, పత్తి పంటలను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెద్దటేకూరుగ్రామంలోని మహేష్ పత్తిరైతు వేసిన పత్తి పంటను అలాగే రాముడు ఉల్లిరైతు వేసిన ఉల్లి పంటను మరియు మార్కాపురం కొట్టాల లోగిడ్డయ్య ఉల్లి రైతు అనే రైతులు వేసిన పంటలను పరిశీలించి వారిని అడిగి వారి బాధలు తెలుసుకొనిఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో రైతులు ఉల్లి, టమోటా, పత్తి, పచ్చిమిర్చి, కంది, మొక్కజొన్న, తదితర పంటలను విస్తారంగా సాగు చేశారని, పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం వారు ఉల్లి పంట కు క్వింటానికి 1200 రూపాయలు, టమోటా కేజీ 8 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పడం ఈ వలన రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. ఉల్లి పంటకు క్వింటానికి మూడు వేలు, పత్తి క్వింటానికి పదివేల రూపాయలు టమోటాకేజీ 20 రూపాయల ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అలాగే రైతులకు ఎకరాకు ఒక పట్టా కళ్ళ0ల్లో ధాన్యాన్ని కావచ్చు ఉల్లిపాయలు పత్తి మిర్చి ఆర పోయడానికి ఒకపట్ట వర్షం వచ్చినప్పుడు పండించిన పంట తడవకుండా కాపాడడానికి మరి ఒక పట్టా కప్పడానికి సచివాల నుంచి సప్లై చేయాలని అలాగే వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు రైతుల సమస్యల కొరకు రైతులకు న్యాయం జరిగే వరకూ రైతులను కూడగట్టుకొని ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల నాయకులు దొడ్డిపాడుభాష కే .పుల్లన్న బి .రాముడు మరియు పెద్దటేకూరు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంకు ప్రముఖుల సందర్శన

**కోడుమూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త ః**



కోడుమూరు పట్టణంలో 14 కోట్లతో భారీ వ్యవయంతో నిర్మించ తలపెట్టిన శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ పున:నిర్మాణ పనులు ఎంతో విశిష్టతతో సాగుతున్నాయి. నాటి సుప్రసిద్ధ దేవాలయాల ఆవశ్యకృతను చాటుతున్న వాటి చరిత్రల్లాగ ఇక్కడ జరిగే ఆలయ పున:నిర్మాణాలు కూడా భావి తరాలకు గుర్తుండే విధంగా శాస్వతంగా నిల్చిపోవాలనే దృడ సంకల్పంతో నెలకొల్పుతున్న ఇలాంటి నిర్మాణాలు ఇక్కడి వారికి గర్వకారణమే అని చెప్పాలి. పంచాయతన దేవతల సహిత శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని దాతల సహకారాలతో నిర్మాణాలను తలపెట్టారు. గత నాల్గేళ్ల నుంచి నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణాలు పూర్తి దశకు చేరుకోవడానికి మరి కొంత కాలం పట్టే పరిస్థితులున్నాయి. అయితే ఇప్పటికే కోడుమూరులో చరిత్ర పుటలో లిక్కించబడే విధంగా రూపుదిద్దుకుంటున్న ఆలయ నిర్మాణాలు ఇతర రాష్ట్రాలకు దశదిశల్లా వ్యాపించిడంతో ఇక్కడి ఆలయ నిర్మాణాలను సందర్శించేందుకు ప్రముఖుల తాకిడి పెరిగడం గర్వించతగ్గ విషయమే. అదే విధంగా ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల నుంచి ప్రముఖ దేవాలయాల పిఠాధిపతులు కూడా సందర్శించారు. కర్ణాటక రాష్ట్రంలోని హంపి పిఠాధి పతులు సందర్శించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం తమిళనాడుకు చెందిన తిరుపూర్ కెపిఆర్ మిల్స్ ఎఫ్.ఎ.ఎస్.వో టెక్స్‌టైల్స్ కంపెనీ ఇండియా ఇంచార్జులు హెడ్ శరవణన్,సౌత్ ఇండియా జోనల్ ఇంచార్జి ఎం.రామలింగమ్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి వారికి ఆలయ పున:నిర్మాణాల ఆవశ్యకత గురించి వివరించారు. ఇలాంటి ఆలయ సందర్శన చేయడం తమకు ఎంతో గర్వంగా ఉందని కమిటి సభ్యులను కొనియాడారు. ఇంతటి పెద్ద మహా యజ్ఞంకు పూనుకున్న ఈ ఆలయ సందర్శనకు త్వరలో తమ కంపెనీ చైర్మన్ కూడా సందర్శించేందుకు వస్తారన్నారు. అనంతరం వారికి ఆలయ కమిటి సభ్యులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి,ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్,మెనేజింగ్ డైరెక్టర్లు ఎద్దుల సూర్యారెడ్డి,ఎద్దుల సత్యారెడ్డి,ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## చిట్టితల్లీ చదువు..నీ భవిష్యత్తు బాధ్యత నాదే

**కర్నూలు విద్య, సెప్టెంబర్ 21, ప్రభాతవార్తః** మంత్రాలయం మండలం బూదూర్ గ్రామానికి చెందిన జెస్సీ అనే బాలికై పత్రికల్లో వచ్చిన కథనానికి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా స్పందించి చిట్టితల్లి ఎటువంటి ఆందోళన లేకుండా చదువు. నీకు కేజీబివి సీటు కల్పించే బాధ్యతను నేను స్వయంగా తీసుకుంటాను అంటూ పోస్ట్ చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి జెస్సీ ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడి చిలకలదోన కెజీబివిలో ఆమెను చేర్పించారు. దీంతో జెస్సీ చదువు కొనసాగించాలన్న ఆకాంక్ష నేరవేరింది. మంత్రి నారా లోకేష్ సందేశంలో చిట్టితల్లి ఇప్పుడు నీకు కేజీబివి సీటు లభించింది ధైర్యంగా చదువు ఇకపై ఏది నిన్ను అడ్డుకోదు పత్తిచేనులో కష్టపడ్డ చిన్న చేతులు ఇకపై పుస్తకాలు, పెన్నులు పట్టి వెలుగైన భవిష్యత్తును నిర్మించాలి అంటూ సందేశం పంపారు. డిఈవో శ్యామ్యూల్ పాల్ స్పందిస్తు పాఠశాలలు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్ర ప్రదేశాలు వారిని జ్ఞానవంతులైన పౌరులుగా మలచడం మా బాధ్యత అని కానీ పిల్లలను పాఠశాలలకు పంపడం తల్లిదండ్రుల బాధ్యత అని కలిసి పనిచేస్తే విద్యాయాత్రలో ఏ చిన్నారి వెనకబడకుండా చూడగలం అంటూ స్పందించారు. జిల్లా విద్యాశాఖ తరుపున మంత్రి నారా లోకేష్‌కు, జిల్లా కలెక్టర్ సిరికి, ఏపీ సమగ్రశిక్షా రాష్ట్ర సంచాలకులు శ్రీనివాసులు, కెజిబివి రాష్ట్ర కార్యదర్శి దేవానంద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

**మహానంది, సెప్టెంబర్ 21, ప్రభాతవార్తః** విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహానందిలోని ఎంసీ ఫారం గ్రామ సమీపంలోని పాలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పొలాల్లో నీరుచేరి విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని చెట్లు, పొలాల వద్దకు రైతులు ఏవరు వెళ్లవద్దన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ సమస్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉరుములు, పిడుగులు సంభవించినప్పుడు విద్యుత్ లైన్స్ కింద ఉండరాదని మీ కనుచూపుమేర ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి వుంటే వెంటనే మీ ఏరియా కంరెటు ఆఫీసుకు గానీ, లేదా మీ యొక్క లైన్‌మెన్‌కు సమాచారం అందించి ప్రమాదాలు నివారించేందుకు సహకరించాలన్నారు.



## ఎర్రగుడి గ్రామంలో కార్డెన్ సెర్చ్

**కొలిమిగుండ్ల, సెప్టెంబర్ 21, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కొలిమిగుండ్ల సిఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలో వీధి వీధిన కవాతు నిర్వహించి అనుమానస్పద ఇళ్ళను తనిఖీచేసి గ్రామ ప్రజలను సమావేశ పరిచి సిఐ రమేష్ బాబు మాట్లాడుతూగ్రామంలో ఏవరైనా అవాంచ సంఘటనలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. గ్రామంలో కక్ష్యలు, కార్పాణ్యాలు లేకుండా ప్రశాంత జీవనం గడపాలన్నదే మాధ్యేయమన్నారు. గ్రామంలో సమస్యలుంటే మా దృష్టికి తీసుకువస్తే వాటిని సామరస్యంగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు జయనాయక్, బాబా ఫకృద్దీన్, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ హోంగార్డులు గ్రామంలో కవాతు నిర్వహించి ప్రజలకు హితబోద చేశారు.



## జిల్లా స్థాయి బీవీ స్మరక క్రికెట్ టోర్నమెంట్

**గోనెగండ్ల, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** నవరాత్రులు,దసర పర్వదినంను పురస్కరించుకొని మండల కేంద్రమైన గోనెగండ్లలో జిల్లా స్థాయి క్రికెట టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు, నిర్వాహకులు రమేష్‌నాయుడు, ముల్ల మాబాషా, జిలాని బాషా, రాంపురం రఫిక్ తెలిపారు. వారు మాట్లా డుతూ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కు మాజీ మంత్రి దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి స్మరకార్థం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.30,000వేలు,రెండవ బహుమతి రూ.20.000వేలు,ఇవ్వనున్నట్లు తెలిపారు.పోటీలో పాల్గొనే జట్లు 22వ తేదిలోపు ప్రవేశరుసుము రూ.1000 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.ఇతర వివరాలకు 7013297759, 8142384021లను స ంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందీప్‌రాయుడు, జయపాల్, రవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## సెయింట్ అంతోనీస్ అనాథాశ్రమంలో వాటర్ ప్లాంటు ఏర్పాటు

**– కేడీఎస్ఎస్ రెవరెండర్ ఫాదర్ తోట జోసెఫ్**

**ఆదోనిలీగల్, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** కర్నూలు కతోలిక పీఠాధిపతులు డాక్టర్ గోరంట్ల జ్వాన్నేస్ ఆశీస్సు లతో కర్నూలు దయాసిస్ సోషల్ సర్వీస్ (కేడీఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని రైల్వే స్టేషన్ గేటు అవతల ఉన్న సెయింట్ అంతోనివారి అనాధాశ్రమ బోర్డింగ్‌లో విద్యార్థుల దాహార్తి కోసం ఆదివారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బోర్డింగ్ డైరెక్టర్ ఫాదర్ ముమ్మాడి ప్రవీణ్, విచారణ గురువు డీన్ గొడుగునూరు ప్రవీణ్‌లు పాల్గొని మాట్లాడారు. కొన్నేళ్ల చరిత్ర కలిగిన పునీత అంతోని వారి అనాధాశ్రమంలో విద్యార్థుల నిత్యావసరాల్లో కీలకమైనది నీటిదాహమన్నారు. భారీ ఖర్చుతో కూడుకున్న ఈ వాటర్ ప్లాంట్ వల్ల పాఠశాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కర్నూలు బిషప్ ఘనం గోరంట్ల జ్వాన్నేస్ తండ్రి గారికి కృతజ్ఞతలు తెలిపారు. పేదలు, అనాథసేవలో తాము ముదుంటామని ఫాదర్ తోట జోసెఫ్ తెలియజేశారు. అనాథాశ్రమ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కన్యస్త్రీలు పాల్గొన్నారు.



## దోమల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

**హోళగుంద, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** గ్రామంలోని దోమల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చలవాది రంగమ్మ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ లు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులు కురుస్తున్న వర్షాలకి దోమలు గ్రామంలోని విపరీతంగా పెరిగిపోయాయి అని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రత పాటిస్తే దోమలు పెరగవని వారు తెలియజేశారు గ్రామంలోని ప్రతి ఒక్క కాలనీలో దోమల నివారణ కోసం పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేపడుతున్నట్లు తెలిపారు అలాగే గ్రామంలోని డ్రైనేజీ క్లీనింగ్ వీధిలైట్లు తడి చెత్త పొడి చెత్త బ్లీచింగ్ చెల్లించడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు తెలియజేశారు గ్రామంలోని తడి చెత్త పొడి చెత్తను పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ ఆటో రిక్షాల ద్వారా తమ ఇంటికి వస్తున్నారని ఎవరో కూడా ఇంటి పరిసరాల్లో చెత్త పాడేయకూడదని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు పంపావతి మోదీన్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## జాలవాడి లో మరోసారి క్షుద్ర పూజలు కలకలం..!

**పెద్దకడబూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** మండల పరిధిలో జాలవాడి గ్రామంలో మరోసారి క్షుద్ర పూజలు కలకలం రేగాయి దీంతో క్షుద్ర పూజలు చేసే ముఠా ఎప్పుడు ఎవరి పొలాల్లో పూజలు చేస్తారోనని గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు గ్రామానికి చెందిన టిడిపి నేత ముక్కన్నా పొలంలో రెండుసార్లు అతని ఇంటి ముందు ఒకసారి క్షుద్ర పూజలు చేయడంతో ముక్కన్న కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు తమపై వరుసగా చేస్తున్న క్షుద్ర పూజలపై పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఈ దారుణానికి పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడం లేదని బాధ్యత కుటుంబ సభ్యులు విలేకరుల ముందు వాపోయారు తాము ఎవర్ని ఇబ్బంది పెట్టలేదని తమపై నే కక్ష కట్టి ఎందుకు క్షుద్ర పూజలు చేస్తున్నారో అర్థం కావడం లేదని దమ్ముంటే ధైర్యంగా తమను ఎదుర్కోవాలని ఇలా లేని పూజలు చేసి భయాందోళన గురి చేయడం సిగ్గుచేటని అలాంటి వారిని పోలీసులు తక్షణమే పట్టుకుని అరెస్ట్ చేయాలని రైతు ముక్కన్న అన్నారు ఆదివారం అమావాస్య కావడంతో శనివారం అర్ధ రాత్రి తన పొలంలో క్షుద్ర పూజలు చేశారని ఉదయం పొలానికి వెళ్లి చూడగా పసుపు నిమ్మకాయలు రవిక మేకులు తదితర వస్తువులతో పూజలు చేపట్టారని వాటిని పెట్రోల్ తో కాల్చి తొలగించడం జరిగిందని తెలిపారు ఇప్పటికైనా పెద్దకడబూరు ఎస్సై స్పందించి క్షుద్ర పూజలపై తమ గ్రామంలో విచారణ చేపట్టి పూజలు చేసే ముఠాను పట్టుకోవాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు తనతోపాటు తమ గ్రామంలో ఒకరిద్దరు పొలాల్లో కూడా ఇలాంటి క్షుద్ర పూజలను చేశారని త్వరలోనే అనుమానం ఉన్న వ్యక్తుల పేర్లను పోలీసులుకు తెలియజేస్తామన్నారు



## నంద్యాలకు తరలివెళ్లిన ఉత్సవమూర్తులు

**మహానంది, సెప్టెంబర్ 21, ప్రభాతవార్తః** శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలు ఆదివారం సాయంత్రం నంద్యాలకు తరలివెళ్లారు. ముందుగా కళ్యాణమండపంలో ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర్‌శర్మ, ప్రధాన అర్చకులు అర్జున్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు శంకరయ్య, రాఘవశర్మ, హరికుమార్ శర్మ, ధర్మతేజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి నంద్యాలకు తరలించారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్‌లు శశిధర్‌రెడ్డి, నీలకంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, నాగభూషణం, జగదీశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.



## నేటి నుండి శ్రీచౌడేశ్వరీదేవి దేవస్థానంలో దసరా ఉత్సవాలు

**– రోజుకోక ఆలంకారంలో అమ్మవారి దర్శనం**

**బనగానపల్లె, సెప్టెంబర్ 21, ప్రభాతవార్తః** మండలంలోని నందవరం గ్రామంలో శ్రీకాశీవిశాలక్ష్మీ ప్రతి స్వరూపమై వెలసిన శ్రీచౌడేశ్వరీ ఆలయంలో శ్రీదేవి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు నేటి నుండి అక్టోబరు 2 వరకు జరగనున్నాయి అందుకు సంబంధిత వివరాలు కార్యనిర్వాహణ అధికారి అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదివారం వెల్లడించారు. సెప్టెంబర్ 22న ఆశ్వయిజ శుద్దపాడ్యమిరోజున అమ్మవారిని శైలపుత్రికగా అలంకరిస్తారు. 23న బ్రహ్మాచారినిగా, 24న చంద్రగంగ అలంకారం, 25న కుష్మాండదేవిగా, 26న స్కందమాతగా, 27 కాత్యాయినిదేవిగా, 28న కాలరాత్రి అలంకారంలో 29న మహాగౌరి ఆలంకారంలో 30 దుర్గాష్టమిరోజున మహాదుర్గాగా, అక్టోబరు 1న సిద్దిదాత్రిదేవిగా, 2న విజయదశమిరోజున శ్రీచౌడేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అదేరోజు సాయంకాలం షమిపూజ, సింహావాహన సేవ, కార్యక్రమాలుంటాయని ఆలయ ఈవో తెలిపారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాని ్న ప్రత్యేక విద్యుత్‌దీపాలంకరణ చేపట్టామని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.



## రాష్ట్రస్థాయిలో స్కేంటింగ్‌లో నంద్యాల విద్యార్థులు ప్రధమ స్థానం సాధించాలి

**నంద్యాల హాస్పటల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో నంద్యాల విద్యార్థులు (క్రీడాకారులు) ప్రధమ స్థానం సాధించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో క్రీడాభారతి అధ్యక్ష కార్యదర్శులు నిమ్మకాయల సుధాకర్, శాంతినేకేతన్ పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలను ఎన్ఎండి ఫిరోజ్, రామకృష్ణా విద్యాసంస్థల అధినేత జి.రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతు మహానగరాలకు పరిమితమైన స్కేటింగ్ క్రీడలు నంద్యాలకు పరిచయం చేసిన నిర్వాహాకులను అభినంధించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో స్కేటింగ్‌లో నంద్యాల విద్యార్థులు ఒలంపిక్ స్థాయికి ఎదగాలని తెలిపారు. విద్యార్థులు అందరు ఆడాలి గ్రౌండ్‌కు రావాలి అనే నినాదంతో క్రీడాభారతి చేస్తున్న కృషికి అందరి ప్రోత్సాహం అంధించాలన్నారు. ఈ పోటీలలో గెలిచిన వారికి గెలివి పాఠశాల అధినేత వశిష్ట, హేమంత్ కుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృపాకర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ మయనీర్ ఖలీల్, టిడిపి నాయకులు బుగ్గరాముడు పాల్గొన్నారు.




## దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు వేళాయే..

**– ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమ్మవారిశాలలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రులు**

**గడివేముల, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేములలోని ఉన్న అమ్మవారిశాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి మొదలు కానున్నాయని గడివేముల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన గుప్తా ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 రోజులు శ్రీమత్ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు తొమ్మిది రూపాల్లో దర్శనమిస్తారని, ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రతిరోజూ కుంకుమార్చన, వాసవీమాత అష్టోత్తర శతనామావళి, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణం, భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని గడివేముల మండల మరియు గడివేముల గ్రామ ఆర్యవైశ్య సోదరసోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.




## రైతులకు అందుబాటులో యూరియా

**: చిప్పగిరి ఏఈఓ రమాదేవి**

**చిప్పగిరి, సెప్టెంబర్, 21, ప్రభాతవార్త:** చిప్పగిరి మండలంలోని రైతులకు ప్రస్తుతానికి 12 టన్నులు యూరియా అందుబాటులో ఉందని ఏఈఓ రమాదేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు అవసరం ఉన్న రైతులకు యూరియా ఇవ్వాలని ఆదేశించిందన్నారు. అందుకుగాను యూరియా అవసరమున్న రైతుల మాత్రం యూరియా బస్తాలు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక రైతుకు సంబంధించిన ఆధార్ కార్డుకు రెండు యూరియా సంచులు మాత్రమే ఇస్తున్నామన్నారు. ఒక యూరియా సంచి ధర రూ, 267 చెల్లించి తీసుకొని పోవచ్చు అన్నారు. యూరియా కావలసిన రైతులు కూడా వారికి అందుబాటులో ఉన్న రైతు సేవ కేంద్రాలకు వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంట్లకు తెలిపి వారి ద్వారా కూడా యూరియా సంచులు పొందవచ్చున్నారు.



## నేటి నుంచి దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు

**కొత్తపల్లె, సెప్టెంబర్ 21, ప్రభాతవార్తః** నల్లమల అడవుల్లో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో నేటి నుండి అక్టోబర్ 2 వరకు కొలనుభారతిదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్ రామలింగారెడ్డి తెలిపారు. కొలనుభారతి దేవి ఆలయంలోని సరస్వతి దేవి అమ్మవారు 9 రోజుల పాటు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. నేడు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి, 23న గాయత్రిదేవి, 24న అన్నపూర్ణదేవి, 25న కాత్యాయనిదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న లలితాత్రిపుర సుందరీదేవి, 28న మహాచండీదేవి, 29న సరస్వతిదేవి అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 30న దుర్గాదేవిగాను, అకో ్టబరు 1న మహిషాసురమర్ధిని, 2న విజయదశమిరోజున రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమివ్వనున్నారు.



## నిద్రమత్తులో ఆలూరు పంచాయతీ

**– ఐద్వా మండల కార్యదర్శి శేఖన్‌బీ**

**ఆలూరు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త;** ఆలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కోయనగర్‌లోని కాలనీల్లో ఐద్వా బృందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి (మహిళా సంఘం) శేఖన్‌బీ మాట్లాడుతూ బాలుర సమీకృత వసతి గృహం వెనకాల చెత్తాచెదారం నిండుకుని పోయి డ్రెయినేజీ నీరు అక్కడే ఉండిపోవడం వల్ల పందులకు, దోమలకు నివాసమైందన్నారు. ఈవిధంగా ఉండడం వల్ల కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేయడం తగదన్నారు. స్వచ్ఛభారత్, పరిశుభ్రత అంటూ రెండు మాటలు చెప్పి చేతులు దులుపుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇప్పటికైనా కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. లేనిపక్షంలో కాలనీవాసులతో కలిసి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.



## వేంపెంటలో అనారోగ్యంతో మృతిచెందిన స్వాములు,దాసు

**– నివాళ్లు అర్పించి ఆర్థికసాయం అందించిన సింగపూర్ తెలుగుసమాజం అధ్యక్షులు**

**పాములపాడు రూరల్, సెప్టెంబర్ 21,ప్రభాతవార్తః** వేంపెంట గ్రామంలో గొనపల్లె స్వాములు, మాదుగుల దాసు ఇరువురు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సింగపూరు తెలుగుసమాజం అధ్యక్షులు టెకూరి నాగేశ్వర్‌రావు వారి మృతదేహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అరి ్పంచారు. స్వాములు కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కుటుంబసభ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప సర ్పంచ్ సత్యరాజు,మాజీ ఎంపిటిసి శివకుమార్, నాయకులు బొమ్మ రాజేష్, సుబ్బరావు, వినయ్, డీలర్ మధు, జీవన్న, ప్రసన్న, వేమారెడ్డి, సురేష్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.



## మురికి కాలువను తలపిస్తున్న గ్రామంలో రోడ్డు

**పత్తికొండ, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోతిరాళ్ళ గ్రామంలో మురికి కాలువను తలపించే రీతిలో ఉన్న రోడ్డును పట్టించుకొనే నాథుడే లేడని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నో సార్లు అధికారులకు పాలకుల దృష్టికి గ్రామంలో ఉన్న రోడ్డు దుస్థితుని తీసుకెళ్ళిన స్పందిం చడంలేదని గ్రామస్తులు తెలిపారు. నడవడానికి వీలులేని గ్రామ నడి బొడ్డున రోడ్డులో నిత్యం ఎంతో రద్దిగా ఉండే ఈ రోడ్డులో జారికింద పడి ఎంతో మంది ఆస్పత్రుల పాలు అయ్యారని స్తానికులు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కోతిరాళ్ళ గ్రామానికి వర్తించదా అని ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. కావున ఇప్పటికైన అధికారులు స్పందించాలని వారు కోరారు.



## మాజీ ఎంపిపి ఇంట్లో నిరుపేదలకు అన్నదానం

**వెల్దుర్తి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** వెల్దుర్తి పట్టణానికి చెందిన గ్రామపెద్దలు, మాజీ ఎంపిపి బొమ్మన దశరథరామిరెడ్డి స్వగృహంలో ఆదివారం నిరుపేదలకు,అనాధలకు అన్నదానం ఏర్పాటుచేశారు. తమ త ండ్రి కీరి ్తశేషులు బొమ్మన రామక్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులతో కలిసి ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బొమ్మన దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తమ తండ్రి వెల్దుర్తి సర్పంచ్‌గా,డోన్ సమితి ప్రెసిడెంట్‌గా,జిల్లాపరిషత్ వైస్ ఛైర్మెన్‌గా 2 పర్యాయాలు, ఒకసారి జిల్లాపరిషత్ ఛైర్మెన్‌గా పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేశారని గుర్తుచేసుకున్నారు. తమ కుటుంబాన్ని వెల్దుర్తి ప్రజలు ఎల్లవేళలా ఆదరిస్తున్నారని వారికి తాము తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బొమ్మన శోభారెడ్డి,బొమ్మన శ్రీకర్‌రెడ్డి,శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



## 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

**– ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, పట్టణ కార్యదర్శి వెంకన్న డిమాండ్**

**ఆదోనిలీగల్, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** శాసనసభలో పాస్ చేసిన 13 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, పట్టణ కార్యదర్శి వెంకన్న, పట్టణ సహకార్యదర్శి ఓ.బి.నాగరాజు, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం వారు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్మికులందరూ కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని గానీ, 13 గంటలకు పెంచేందుకు కాదన్నారు. మహిళా కార్మికులందరూ రాత్రి డ్యూటీ కావాలనే కూటమి ప్రభుత్వానికి ఓటేశారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే పని భారం తగ్గిస్తామని చెప్పిన కూటమి నేతలు నేడు పని గంటలను పెంచడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మెప్పు కోసం రాష్ట్రంలో ఉన్న కార్మికులను ఉద్యోగులను యజమానులకు బలి ఇస్తున్నారన్నారు. వెంటనే పని గంటలను తగ్గించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. పని గంటలకు వ్యతిరేకంగా సోమవారం చేపట్టే నిరసన కార్యక్రమంలో కార్మికులు, అన్నివర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఇటిక్యాల గ్రామంలో పురాతబావిని వాడుకలోకి తెచ్చిన తోట శివారెడ్డి

**కొలిమిగుండ్ల, సెప్టెంబర్ 21, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో గత ఐదు సంవత ్సరాల నుండి పురాతన బావి పాడుబడిపోయింది. ఆ బావిని వాడుకలోకి తేవాలని గ్రామ టిడిపి నాయకులు తోట శివారెడ్డి ఆధ్వర్యంలో బావి చుట్టు జేసిబితో క్లీన్ చేయించి బావి తాపలంబడి ఉన్న చెత్తాచేదారాన్ని తొలగించి బావిని శుభ్రపరిచి వాడుకలోకి తేవడం జరిగింది. ఈసందర ్బంగా తోట శివారెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు బావిని వాడుకలోకి తేస్తే విద్యార్థులు, యువకులు స్విమింగ్‌పూల్‌గా వాడుకొని గ్రామానికి సౌకర ్యంగా ఉంటుందని టిడిపి నాయకుల దృష్టికి తేవడంతో ఈకార్యక్రమాన్ని ఆయన సొంత నిధులు రూ.12 వేలు ఖర్చుచేసి ఈకార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్ వారి సహాయంతో నిర్వహించడం జరిగింది. బావిని వాడుకలోకి తేవడం వల్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# నంద్యాలలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎన్ఎండి.ఫిరోజ్

- పునరావాస పనుల ఏర్పాట్లపై అధికారులకు సూచన



**నంద్యాల, సెప్టెంబరు 21, ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల పట్టణంలోని పాలేరువాగు, మద్దిలేరువాగు ప్రవహిస్తుండటంతో ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణలోని లోతట్టు కాలనీలు వరదప్రభావానికి గురయ్యాయి. ఎపి రాష్ట్రమంత్రి వర్యులు ఎన్ఎండి.ఫరూక్ ఆదేశాలమేరకు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్ తక్షణమే విశ్వనగర్, శ్యాంనగర్, ఎస్‌బిఐ కాలనీ వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని స్వయంగా మోకాటిలతోతు వరద నీరులో దిగి ఆ ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. శ్యాంనగర్‌లో వరదనీరు ఇళ్లలోకి చేరుకోవడంతో సుమారు 30 కుటుంబాలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన ఆహారకిట్లు, తాగునీరు పంపిణీ చేయడానికి ఏర్పాటుచేశారు. అలాగే నంద్యాల అర్బన్ ఎంఆర్ఓ సత్యశ్రీనివాసులు, నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ వెంకటదాసుతో కలిసిపునారావాస, సహాయక చర్యలపై చర్చించారు. అనంతరం స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భయపడవద్దని వరద నివారణ చర్యలు చేపట్టామని, త్వరలో వరదనీరు తగ్గుముఖం పడుతుందని వారికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే ఎన్ఎండి ఫిరోజ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ప్రభావిత కుటుంబానికి తక్షణ సహాయం అందిస్తూ పునరావాస పనులు వేగవంతంగా చేపడుతూ నంద్యాలకు చెందిన ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండ సమన్వయంతో పనిచేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగ వరదనీరుతో ఇబ్బంది పడుతున్నామని తెలిసి తమమధ్యకే వచ్చి ఎన్ఎండి.ఫిరోజ్ అన్ని ఏర్పాట్లు చేస్తుండటంతో వరద బాధితులు, స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపిపట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, మున్సిపల్ కౌన్సిలర్ దూదేకుల జైనబీ, టిడిపి నాయకులు రామమద్దయ్య,శ్రీకాంత్‌నాయుడు, దూదేకుల దస్తగిరి, మల్లెల భాస్కర్,ఖాదర్‌బాష, ఖాజాదేవానగర్,గోవిందునాయుడు, బుగ్గరాముడు, మున్నానాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నుండి టీడీపీలో చేరిక..

**మంత్రాలయం, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** పెద్దకడబూరు మండలం నాగలాపురం గ్రామంలో 30 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు వైసీపీని వీడి ఆదివారం టీడీపీ పార్టీలో చేరారు. దీంతో మంత్రాలయం వైసీపీ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి, పెద్దకడబూరు వైసీపీ మండల ఇన్‌చార్జి రామ్మోహన్‌రెడ్డి, కన్వీనర్ పురుషోత్తంరెడ్డికి గట్టి షాక్ తగిలింది. పెద్దకడబూరు మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన వారు మాధవరంలోని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి కార్యాలయంలో ఎన్.రాఘవేంద్రరెడ్డిసోదరులు ఎన్.రఘునాథ్‌రెడ్డి, మంచాల సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి సమక్షంలో గ్రామ నాయకులు హనుమయ్య, బి.వీరేష్ ఆధ్వర్యంలో చేరారు. వైసీపీ పార్టీని వీడిన వారిలో కె.వీరభద్ర, చంద్రశేఖర్, శరణబసవ, గంగన్న, మంజునాథ్, మల్లికార్జున, ఈరన్న, నరసింహులతో పాటు మరి కొంతమంది టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నాగలాపురం గ్రామానికి చెందిన వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మాకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. అలాగే గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేదని, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కార్యకర్తలకు, నాయకులకు న్యాం చేయలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం టీడీపీ పార్టీ, కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాల వారికి సముచిత స్థానం, న్యాయం చేస్తూ పాలన చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని ప్రజలు నమ్మ బలికార్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై రోజురోజుకు ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్ప డిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మాలపల్లి లక్ష్మయ్య, దబ్బుల నరసింహా తదితరులు పాల్గొన్నారు.



# ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- హెక్టారుకు రూ.50 వేలు పరిహారం
- త్వరలోనే రైతులకు మంజూరు : తిక్కారెడ్డి



**మంత్రాలయం, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** రాష్ట్రంలో ఉల్లి పంట సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కావునా ఉల్లి రైతులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకోలేదన్నారు. ఉల్లి రైతులను ఆదుకోవడంలో దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అసెంబ్లీకి రావాలన్నారు. ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వాలన్నారు. కావునా ఇప్పటికైనా వైసీపీ నాయకులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పన్నాగ వెంకటేష్, అండే హనుమంతు, కృష్ణమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, విజయ్‌రామిరెడ్డి, అబ్దుల్, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

# జీడీపీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

- 4వ గేటు నుంచి 330 క్యూసెక్కుల నీరు విడుదల
- ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో 400క్యూసెక్కులు



**గోనెగండ్ల, సెప్టెంబరు, 21, ప్రభాతవార్త** గాజులదిన్నె ప్రాజెక్టు 4వ గేటు నుంచి శనివారం 330 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. శుక్రవారం ఉదయం నీటి విడుదల చేశారు. అయితే గత నాలుగైదు రోజులుగా ఎడతెరపలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టు కు గత నాలుగు రోజుల నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. శనివారం ఉదయం ప్రాజెక్టుకు 400 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో 330 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జీడీపీ ఏఈ మహమ్మద ఆలీ తెలిపారు. ప్రాజెక్టు ప్రస్తుతం 4 టీఎంసీల వరద నీరు చేరింది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5టీఎంసీల నీటి మట్టాన్ని బట్టి ఉన్నాతిధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల చేస్తున్నాట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికేర, దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి, ప్రాంతాలలో వర్షాలు కురియడంతో వరద నీరు వచ్చి జీడీపీలోకి చేరుతుంది.

# మణేకుర్తిలో కనకదాసు విగ్రహ ధ్వంసం కేసులో వ్యక్తి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ రవిశంకర్‌రెడ్డి



**ఆలూరు, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** ఆలూరు మండలంలోని మణేకుర్తి గ్రామంలో ఈనెల 10వ తేదీన భక్త కనకదాసు విగ్రహం ధ్వంసం కేసులో మరకట్టు భగవంతప్పను అరెస్టు చేసినట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని చూపుతూ సీఐ వివరాలు వెల్లడించారు. గ్రామంలో కురువ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ కంటెప్పగారి దేవేంద్ర వర్గానికి కేసులో ముద్దాయి అయిన మరకట్టు భగవంత్ప వర్గానికి కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు విషయంలో వివాదం కొనసాగుతుందన్నారు. సర్పంచ్ కంటెప్పగారి దేవేంద్ర వర్గీయులు గ్రామంలో జాతీయ రహదారి పక్కన విగ్రహ ఏర్పాటుకు నిర్ణయించగా, మరోవర్గం ఒప్పుకోకపోయినా అలానే విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ తర్వాత సర్పంచు వర్గీయులు అవమానకరంగా రెచ్చగొట్టడం జీర్ణించుకోలేక మద్యం సేవించి మద్యం మత్తులో రాయితో భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. కమ్మరచేడు గ్రామ డాబా వద్ద ఉన్న మరకట్టు భగవంతప్పను అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకోవడం జరిగిందన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ ట్వీట్‌తో విద్యార్థినికి కేజీబీవీలో సీటు

- స్వయంగా సీటు అందించిన డీఈఓ
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



**మంత్రాలయం, సెప్టెంబరు21, ప్రభాతవార్త;** మండలంలోని బూదూరు గ్రామానికి చెందిన హరిజనకుమార్, సంతోషమ్మలు జీవనం రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరిలో రెండో సంతానమైన జెస్సీ ఆరో తరగతి చదువుకోవడానికి మండలంలోని చిలకలడోణలో ఉన్న కేజీబీవీ పాఠశాలకు దరఖాస్తు చేసింది. అయితే కేజీబీవీలో సీటు రాలేదు. సీటు రాకపోవడంతో చదువు మానేసి వారి తల్లిదండ్రులతో పాటు సీడు పత్తికి పనులకు వెళ్లింది. విద్యార్థిని పాఠశాలకు వెళ్లకుండా పనులకు వెళ్తున్న సమాచారం పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో రావడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. వెంటనే విద్యార్థినికి కేజీబీవీలో సీటు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు స్పందించిన డీఈఓ శామ్యూల్‌పాల్ ఆదివారం విద్యార్థినీ తల్లిదండ్రులను పిలిపించి బాలికతో ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థిని చదువుపై ఆసక్తి చూపడంతో ప్రిన్సిపల్ శాంతితో చర్చించి కేజీబీవీలో సీటు ఇప్పించారు. మంచాల సహకార సంఘం చైర్మన్ రామకృష్ణారెడ్డి, డీఈఓ చేతులమీదుగా బాలిక తల్లిదండ్రులకు సీటు అందించారు. ఇందుకు బాలిక తల్లిదండ్రులు మంత్రి లోకేష్, డీఈఓకు, మండల విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతుల సంక్షేమానికి.. టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి

- ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్



**ఆలూరు, సెప్టెంబరు21, ప్రభాతవార్త,** రైతులను ఆదుకోవడానికి, రైతుల సంక్షేమానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి మాట్లాడుతూ ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి, గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతన్నల కష్టాలను చూడలేక ఉల్లి పండించిన ప్రతిరైతుకు హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. దీంతో ప్రభుత్వంపై రూ.వంద కోట్లు భారం పడుతుందన్నారు. అలాగే రైతు శ్రేయస్సుకై ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ పథకం రూ.20 వేలు ఇస్తామని చెప్పడం జరిగిందని, దీని ద్వారా ఒక్కో రైతుకు రూ.7 వేలు అందించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం హత్తిబెళగల్ లక్ష్మన్న అనే రైతుకు సబ్సిడీ కింద డ్రోన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి టీడీపీ కన్వీనర్లు, నాయులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు, డీసీ చైర్మన్లు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి వచ్చిన వినతులను.. చిత్తశుద్దితో పరిష్కరించాలి

- మంత్రి బిసి.జనార్ధనరెడ్డి



**నంద్యాల, సెప్టెంబరు 21, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజల నుంచి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను రాష్ట్రరోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి. జనార్ధనరెడ్డి ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను మంత్రి బిసి.జనార్ధనరెడ్డి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. అలాగే చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించారు. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సర్వత్రా సంతోషం వ్యక్తమైంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమినాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే.. చర్యలు తప్పవు

: నంద్యాల ఎన్ఎస్‌టిఆర్ సర్కిల్‌లో అటవీశాఖ ఉద్యోగాల ప్రక్షాళన
: నల్లమలలో పెద్దపులుల సంరక్షణ, పర్యావరణం అడవి సంపదే లక్ష్యం
: అటవీశాఖ ఆధ్వర్యంలో టూరిజంల అభివృద్ధికి శ్రీకారం
: నంద్యాల ఎన్ఎస్‌టిఆర్ టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్
: ఆదివారం ప్రతవార్తతో ముఖాముఖి సమావేశం





**ఆత్మకూరు, సెప్టెంబర్21, ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో అటవీశాఖ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోక తప్పదని ఎన్ఎస్‌టిఆర్ నంద్యాల జిల్లా సర్కిల్ టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ బి.విజయ్ కుమార్ ఆదివారం ప్రభాతవార్తతో ముఖాముఖిగా పలు విషయాలు మాట్లాడారు గతంలో ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్‌లో డిఎఫ్ఓగా విధి నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా ఎవరికి రాజీ పడకుండా నా ఉద్యోగం నేను చేసుకుంటూ వెళ్లాలని వివరించారు. అడవి సంపద వన్యప్రానుల సంరక్షణ పర్యావరణంపై ప్రత్యేక కృషి సారించి ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే పర్యాటక రంగాని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అటవీశాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ స్మృతి వనం బైర్లూటిలో ఏకో టూరిజంతో పాటు పర్యటకులకు సపారి తోపాటు నిరుద్యోగ యువకులకు బేస్‌క్యాంపుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించి ఎంతో మందికి అండగా నిలిచారు. ప్రస్తుతం నంద్యాల జిల్లా ఎన్ఎస్‌టిఆర్ సర్కిల్ పరిధిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మొదటి సారిగా ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్‌లో పర్యటన చేశారు. ఈ నేపథ్యంలోనే దాదాపు పలు విషయాలను ప్రభాతవార్తతో గుర్తు చేసుకున్నారు. అటవీశాఖలో ఉద్యోగులను ప్రక్షాళన చేసే విదంగా చొరవ తీసుకుంటామని తెలిపారు. ప్రధానంగా అటవీశాఖలో ఎదుర్కొంటున్న 3 సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. ప్రాణాలతో సాహసం చేస్తున్న అటవీశాఖ సిబ్బందికి అన్ని విదాలుగా తమ సహాయ, సహకారాలు ఉంటాయని తెలిపారు. స్మగ్లరులకు, వేటగాళ్లకు ఆ అధికారి పేరు చెబుతునే గుండెలో వనుకుపుట్టే విదంగా అటవీశాఖ చట్టాలను అమలు చేయబోతున్నామని చెప్పారు. అటవీశాఖ పరిధిలో ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకోని సామరస్యంగా పరిష్కరించుకోవడం జరుగుతుందని అన్నారు. విధి నిర్వహణలో ఎవరికి అదరదు.. బెదరదు.. అనే విదంగా తమ ఆశయం నేరవేర్చుకుంటూ ఎన్ఎస్‌టిఆర్ సర్కిల్ పరిధిలో అటవీశాఖ ఉద్యోగులు అంటేనే ఓ ప్రత్యేక గౌరవం తీసుకోని రావడమే తమ లక్ష్యసాధన అని ప్రభాతవార్తతో ముఖాముఖిగా తెలియజేశారు. అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశిస్తే అటవీశాఖ కఠినమైన చట్టాలు అమలు చేస్తే జీవితాంతం జైలుకు వెళ్లే విదంగా శిక్షలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయాని ప్రజలు దృష్టిలో ఉంచుకోని అటవీశాఖ అధికారులకు, అటవీకి సమీపంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు సహకరించే విదంగా ముందుకు రావాలని కోరారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.



**కర్నూలు సెప్టెంబర్ 21 ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# నందికొట్కూరులో గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్టు



**నందికొట్కూరు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** నందికొట్కూరులో గంజాయి విక్రయిస్తున్న నలుగురుని అరెస్టు చేసి 1100 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సి.ఐ. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్తానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు కావేటిరాజు(ఆత్మకూరు), పింజరి మహాబూబ్‌భాష సంఘయ్యపేట (నందికొట్కూరు), దూదేకుల ముర్తుజావలి ఎస్ఎస్‌నగర్ (నందికొట్కూరు), షేక్.సోహెల్ ఎస్ఎస్‌నగం (నందికొట్కూరు), కావేటి నాగశేషాద్రి,(ఆత్మకూరు) అనే ముద్దాయిలు గత కొంత కాలంగా ఒరిస్సా నుంచి కావేటి రాజు గంజాయి తెప్పించి వీరికి కేజీ రూ.5 వేలకు అమ్మేవాడని, పట్టుబడిన వారు దానిని ప్యాకెట్లుగా తయారు చేసి రూ. 500లు చొప్పున పట్టణంలో రహస్యంగా అమ్ముతున్నారని సమాచారం అంధిందన్నారు. ఆదివారం మధ్యాహ్నం ముద్దాయిలు ఆత్మకూరు రోడ్డులో నాగరంగం వెంచరు నందు ఉండగా దాడి చేసి వారి నుండి 1100 గ్రాములు గంజాయి, రూ.3 వేలు నగదు, నాలుగు సెల్‌పోన్లు స్వాధీనం చేసుకొని నలుగురుని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని, మరో వ్యక్తి పరారిలో ఉన్నట్లు సి.ఐ.తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 50 వేలు ఉంటుదన్నారు. ఈ సమావేశంలో ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# సి.ఎం.సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి-ఎమ్మెల్యే



**నందికొట్కూరు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యము కాపాడుకోవాలని నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జ్ సీనియర్ నాయకులు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొణిదేల గ్రామానికి చెందిన శ్రావణికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు అయిన రూ.2లక్షల50వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో స్తానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉత్సవాలకు రావాలంటూ ఎమ్మెల్యే దంపతులకు ఆహ్వానం

**మహానంది, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** నేటి నుండి మహానంది క్షేత్రంలో అంగరంగవైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శైలజమ్మలకు ఆదివారం మహానంది దేవస్థానం తరుపున ఆహ్వానం అందజేశారు. ఈవో శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జున్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు శంకరయ్యలు ముందుగా ఎమ్మెల్యే దంపతులకు పట్టువస్త్రాలతో సన్మానించి స్వామివారి ప్రసాదాలు అందజేసి స్వామివారి ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం నవరాత్రి ఉత్సవాలపై ఎమ్మెల్యేకు వివరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈవోకు ఎమ్మెల్యే సూచించారు. వారివెంట టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులున్నారు.

